వెల్లివిరిసిన సంక్రాంతి శోభ

లంక గ్రామాల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



లంక గ్రామాలలో సంప్రదాయబద్ధంగా కత్తికట్టని కోడి పందేలు ప్రారంభిస్తున్న ఎంపీ ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, తెనాలి నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలో లంక గ్రామాలలో సాంప్రదాయబద్ధంగా కోడి పందేలు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగతో పల్లెలు కళకళలాడుతున్నాయన్నారు. కోడికి కత్తి కట్టకుండా కోడి పందేలు నిర్వహించాలని, కత్తి కట్టి ఆడుతున్నట్లు తెలిస్తే అటు వంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం కత్తి కట్ట కుండా కోడి పందేలను ప్రారంభించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో...

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్యవైశ్య సంఘం, ఆధ్యాత్మిక సేవా కమిటీ, ఆర్యవైశ్య మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆవరణలో భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాల శేషాచలం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక సేవా కమిటీ చైర్మన్ చుండూరు శివప్రసాద్, మహిళ సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీ పద్మావతి, నాయకులు ఆతూకూరి పూర్ణచంద్రరావు, తూనుగుంట్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరపేటలో భోగి మంటలు వేస్తున్న ఆంజనేయ యోగ మండలి సభ్యులు

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లో భోగిపండుగ వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం తెల్లవారుజామున భోగి మంటలను వేశారు. రామలింగేశ్వరపేటలోని ఆంజనేయం ధ్యాన యోగ మండలి కార్యాలయం ఎదురు తెల్లవారుజామున భోగి మంటలు వేసి భజ గోవిందతో పాటు పలు కీర్తనలు పాడారు. భోగి మంటల్లో పాత వస్తువులను తగ్గుల బెట్టారు. యోగ మండలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లో వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం కన్వీనర్ ఎం.రమణయ్య ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ఎస్వీయోగ సభ్యులు పాల్గొన్నారు. రూరల్ మండలం పలు గ్రామాల్లో భోగి మంటలు వేశారు.



తెనాలిలో ఓ అపార్ట్‌మెంట్‌లో వెలుగుతున్న భోగిమంటలు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: భోగి వేడుకలను తెనాలిలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే తలంటు స్నానాలు చేసి భోగి మంటలు వేసి ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న పాత వస్తువులను వాటిలో వేశారు. చిన్నారులు మంటల వద్ద సందడి చేశారు. తెనాలి పట్టణంలోని చెంచుపేట, నందులపేట, నాజరుపేట, వహాబ్‌రోడ్డు, చంద్రబాబునాయుడు కాలనీ, చినరావూరు, ఐతానగర్, తదితర ప్రాంతాల్లో తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. ఉదయం చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

క్లుప్తంగా

హిజ్రాలకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: రాత్రి వేళల్లో ప్రయాణికులను అటకాయించి ఇబ్బందులకు గురి చేస్తున్న హిజ్రాలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తెనాలి మండలం అంగలకుదురు శివారులో కొందరు హిజ్రాలు రోడ్డు వెంబడి ఉంటూ అక్కడి మార్గంలో వచ్చే ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఆకస్మికంగా ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ రోడ్డు వెంబడి ఉన్న హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ప్రయాణికులు, స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్, తెనాలి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని రహదారులపై నివాసిస్తున్న పేద గిరిజనులకు నూతన వస్త్రాలు, బియ్యం, దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత రావూరి అంజలి మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో నివాసిస్తున్న గిరిజన తెగలను గుర్తించి వారికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రావూరి సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో తెనాలి సేవా మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఎస్వీయోగ సభ్యుడు మొవ్వా పున్నయ్య తల్లి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, మొవ్వా పున్నయ్య, పుట్టిపు రాజేష్, మిత్రమండలి సభ్యులు చెరుకూరి రమేష్‌బాబు, వెంకట శివయ్య, కరిముల్లా బాబు, పోతురాజు, అఖిల్ నాయుడు, శ్రీను నాయక్, చైతన్య, దుర్గ, రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు సురేష్‌బాబుకు సత్కారం



తెనాలిటౌన్: పట్టణంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెన్షనర్స్ అసోసియేషను హాలులో శనివారం జరిగిన సభలో ఎన్టీఆర్ నటించిన సినిమాలు, ఆయన వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ పాత్రలు అధ్యయనం చేసిన విధానం అనే అంశంపై న్యాయవాది మద్ది మల్లిఖార్జున రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాకారుడు పత్తిపాటి సురేష్‌బాబును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వి.భీమేశ్వరప్రసాద్, మాదల కోటేశ్వరరావు, డీఎల్ కాంతారావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి..

నగరం: సంక్రాంతి సందర్భంగా కొడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బొరమాదిగ పల్లి పంచాయతీ చల్లమ్మ అగ్రహారంలో కొడిపందేల స్థావరంపై శనివారం నగరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. చల్లమ్మ అగ్రహరంలో కొడిపందేల స్థావరంపై దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, రెండు కొడి పుంజులు, రూ.2,100ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్లాబ్ పెచ్చులు ఊడి పడి హోంగార్డు మృతి



తెనాలిరూరల్: శ్లాబ్ పెచ్చులు తల మీద పడి హోంగార్డు మృతి చెందిన ఘటన తెనాలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలెంలో నివసించే మల్లవరపు వెంకటకృష్ణారావు(49) పోలీసుల శాఖలోని కమ్యునికేషన్స్ విభాగంలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం కాలకృత్యాలకు ఇంటి వెనుక ఉన్న బాత్రూమ్‌కు వెళ్తుండగా, అక్కడి శ్లాబ్ పెచ్చులు తలపై పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆచప అనారోగ్య కారణాలతో రెండు రోజులుగా సెలవులోనే ఉన్నారు. సమాచారమందుకున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కృష్ణ, వన్ టౌన్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, ఇతర పోలీసుల అధికారులు సిబ్బంది, ముత్తెంశెట్టిపాలెం ఇంటి వద్ద ఉన్న వెంకటకృష్ణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రేపల్లె రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మోపిదేవి రాజీవ్ యువసేన సహకారంతో శనివారం పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్‌లోని ఎన్టీఆర్ స్కూల్ ఆవరణంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విజయసారథి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కౌన్సిలర్ కోటేశ్వరరావు, సీపీఎం పట్టణ అధ్యక్షుడు మణిలాల్, ఎస్ఎఫ్ఐ పట్ణ కార్యదర్శి సూర్యప్రకాష్, డీవైఎఫ్ఐ నాయకులు, ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథ స్వామి కల్యాణం



గోదా రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వాసవీ దేవస్థానంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: పట్టణ వీఎస్సార్ కాలేజ్ రోడ్డులోని జయప్రకాష్‌నగర్‌లో శరణాగతి గోష్ఠి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నెలరోజుల నుంచి జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. నరేంద్ర రామానుజ దాస స్వామి పర్యవేక్షణలో డిసెంబర్ 15నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా శ్రీ గోదా రంగనాథస్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

- పట్టణ నెహ్రూరోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధనస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు వి.మాధవకుమార్, టి.రఘులు కళ్యాణం చేయించారు. అర్చకులు వి.కేశవ్, వి.శేషుకుమార్‌లు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మల్లేశ్వరి పర్యవేక్షించారు.
- బోసురోడ్డులోని వాసవీ దేవస్థానం ఆవరణలోని రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి గోదా రంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవర్తి, సాయి, సాకేతులు కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కళ్యాణం తిలకించారు. కొండపి వసుంధర బృందం వారు అలపించిన సంకీర్తనలు విశేషంగా అలరించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



క్రికెట్ పోటీలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేసిన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నాయకులు దర్శి విజయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మానందపురం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, పండుగ సమయంలో యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ దర్శి రమేష్, కర్రి రోహిత్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



మంగళగిరి(తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేటలో ఎస్ఈబీ పోలీసులు శనివారం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున రావు తెలిపిన వివరాలు.. మంగళగిరి కొత్తపేట బావి సెంటర్ సమీపంలో నాన్ డ్యూటీ (తెలంగాణ)కు చెందిన మద్యాన్ని కె.కిరణ్‌బాబు అమ్ముతున్నాడని సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలసి దాడి చేసినట్లు చెప్పారు. కిరణ్‌బాబు వద్ద నుంచి 30 మద్యం సీసాలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ పద్మజ, రజని, పిసిలు శ్రీనివాసరావు, రమేష్‌లు ఈ దాడిలో పాల్గొన్నారు.

సంప్రదాయ పోటీలు నిర్వహించడం అభినందనీయం

ఫిరంగిపురం: సంప్రదాయ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద గుండురాయి ఎత్తు పోటీలు శనివారం సాయంత్రం నిర్వహించారు. పోటీలను సయ్యద్ హబీబుల్లా, అమీనాబాద్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొరివి ఆనంద్, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ సుభానీలు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 102 కేజీల గుండురాయిని ఐదు నిమిషాల వ్యవధిలో ఎన్నిసార్లు ఎత్తి పడవేస్తారో వారు విజేతగా నిలుస్తారని న్యాయనిర్ణేతలు భీమనాథుని చలపతిరావు, సయ్యద్ సైదా ప్రకటించారు. పల్నాడు జిల్లా పమిడి గ్రామానికి చెందిన వీరాంజనేయులు నాలుగు నిమిషాల వ్యవధిలో గుండరాయిని 25 సార్లు ఎత్తి పడవేసి ప్రథమ బహుమతి విజేతగా నిలిచారు. ద్వితీయ బహుమతి విజేతగా నరేంద్ర ఐదు నిమిషాల వ్యవధిలో 21 సార్లు, తృతీయ బహుమతి విజేతగా నాగరాజు 13 సార్లు వేశారు. ప్రథమ బహుమతిని గ్రామానికి చెందిన సయ్యద్‌బహదూర్‌సాహెబ్, ఆషిరిఫుల్‌ల జ్ఞాపకార్థం రూ.5,116 అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ.3,116, తృతీయ బహుమతిగా రూ.2,116 విజేతలకు అందజేశారు.

ముగ్గుల పోటీల్లో శివమ్మకు తృతీయ బహుమతి

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పిట్టలవానిపాలెం మండలం చందోలు 1వ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కుంచల శివమ్మ తృతీయ బహుమతి సాధించింది. బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్ బహుమతిని శనివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది శివమ్మను అభినందించారు.

వైద్యవృత్తికే వన్నె తెచ్చిన మురళీధరరాజు

పిట్టలవానిపాలెం: వైద్యవృత్తికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ పెనుమెత్స మురళీధరరాజు అని బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంత వర్మరాజు పేర్కొన్నారు. కర్లపాలెం మండలం బుద్దాం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ పెనుమెత్స మురళీధరరాజు దంపతులను క్షత్రియ సేవా సంఘం సభ్యులు శాలువా కప్పి, నూతన వస్త్రాలను బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే ఎడ్యుకేషన్ చైర్మన్ వేగేశన రాధాకృష్ణంరాజు, అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, పిట్టలవానిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోకరాజు మూర్తిరాజు తదితరులు ఉన్నారు.

విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీ ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

మున్నంగి(కొల్లిపర): రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, విశ్రాంతి ఉపాధ్యాయులకు సత్కారం, పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్యఅతిథుథు గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా తొలిసారిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల చదువుకు ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రతి పాఠశాలను ఆధునికీకరణ చేయటం, ప్రతి విద్యార్థికి చదువుకు కావాల్సిన పుస్తకాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యను తీసుకొచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు



సంక్రాంతి సాంస్కృతిక సంబరాల్లో భాగంగా పాటలు పాడుతున్న గాయకులు

కొల్లిపర: పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు అని ఎంపీపీ పద్మావతి అన్నారు. శనివారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు ప్రాంభించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన ఎంపీపీ పద్మావతి సంజీవరెడ్డి, పారిశ్రామికవేత్త కూరపాటి రవిశేఖర్ వెలిగించి ప్రారంభించారు. అనంతరం పాడాలని ఉంది, సినీ సంగీత విభావరి, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే ప్రేమతో నాన్న నాటిక ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరిమండ పెద్ద నాగిరెడ్డి, సహాయ కోశాధికారి అన్నవరపు రమేష్, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.25వేల సాయం

అమర్తలూరు(వేమూరు): మండలంలో తురిమెళ్ల గ్రామానికి చెందిన పేద విద్యార్థిని మహాలక్ష్మికి మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా అమర్తలూరుకు చెందిన పచ్చ ధనుంజయ ప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి కస్తూరి రూ.25 వేలను విద్యార్థినికి అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని భాను ప్రసాద్, అళ్ల అంకమరావు, నార్ల వెంకటేశ్వరరావు, నన్నపనేని అనిల్‌కుమార్, చేకూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జన్మతిథి వేడుకలు

కర్లపాలెం: రామకృష్ణ సేవా సమితిలో శనివారం స్వామి వివేకానంద జన్మతిథి వేడుకలు ఘనంగా జరిగాయి. సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు వివేకానందుని బోధనల గురించి భక్తులకు వివరించారు. మంతెన సత్యనారాయణ రాజు, చందు, పిచ్చయ్య, మహిళలుఉన్నారు.